క్లుప్తంగా

వాహనాల తనిఖీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం - తాడిపత్రి రహదారిపై ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

గ్రూప్-2 పరీక్షలు ఫిబ్రవరిలో నిర్వహించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర

గుంతకల్లుటౌన్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలను ఫిబ్రవరి నెలలో నిర్వహించాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జనవరి 5న గ్రూప్-2 నిర్వహిస్తామని తేదీని ప్రకటించిందని పేర్కొన్నారు. అయితే డిసెంబర్‌లో కానిస్టేబుల్ ఈవెంట్స్, రైల్వే పరీక్షలు ఉన్నాయని గుర్తు చేశారు. నిరుద్యోగ యువత పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు సమయం ఇవ్వాలని కోరారు. గ్రూప్-2 పరీక్షల తేదీని పొడిగించాలన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు సునీల్, మల్లేష్, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చొరవ



షెడ్డు పనులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

యల్లనూరు: తిమ్మంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యార్థం 1968-69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.1.5 లక్షల అంచనాతో ఆదివారం షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఫణిశర్మ, సుదర్శన్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడుగుపల్లిలో కేబుల్ చోరీ

పుట్లూరు: మండలంలోని మడుగుపల్లిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్ చోరీ చేశారు. గ్రామానికి చెందిన ఆరుగురు రైతుల బోరుబావుల వద్ద కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఉదయం పండ్ల తోటలకు నీరు వదలడానికి వెళ్లిన రైతులు కేబుల్ వైర్లు లేకపోవడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



నియామక పత్రం అందజేస్తున్న భీమలింగ

గుంతకల్లు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం ద్వారా విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో లబ్ధి చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ వై.భీమలింగ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు అండగా ఉంటామని చెప్పి, ఇప్పుడు మాట తప్పడం జరిగిందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా సంపత్ కుమార్, ఉపాధ్యక్షులుగా కిరణ్, వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా బూర్ల రాజేష్, కార్యదర్శిగా ఎం.వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా సుధాకర్, దుర్గ, కోశాధికారిగా తిమ్మప్పను ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గుత్తి: ఇటీవల అనంతపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉషు (ఫుట్‌బాల్ లాంటి క్రీడ) సెలెక్షన్స్‌లో గుత్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. జ్యోత్స్న, చిన్ని, నిహారిక, మేనక, సుకన్య, అఖిల, త్రిష, హేమలత, మహిత, బాను, రాగవి రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఉషు పోటీలు ఈనెల 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో జరుగుతాయని పాఠశాల పీడీ సరోజ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం ఉషారాణి, పీడీలు సరోజ, శ్యామల, శకుంతల, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తుల కొంగుబంగారం

బుగ్గ రామలింగేశ్వరుడు



బుగ్గరామలింగేశ్వరుడి మూలవిరాట్



బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం



నందివిగ్రహం



గాంధీకట్ట వద్ద నిర్మించిన ఆలయ ముఖ ద్వారం

- కార్తీక ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి హయాంలో జోరుగా అభివృద్ధి పనులు

తాడిపత్రిటౌన్: కోరిన కోర్కెలు తీర్చేదైవం. భక్తుల కొంగు బంగారంగా బుగ్గరామలింగేశ్వరుడి ఆలయం విరాజిల్లుతోంది. తాడిపత్రి పట్టణంలోని పెన్నానది దక్షిణ ఒడ్డున వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాస ఉత్సవాలు జిల్లాలో ఎక్కడా లేని విధంగా నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా ఇక్కడ నిర్వహిస్తుంటారు.

వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు..

కార్తీక ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచేకాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రల నుంచి పెద్ద ఎత్తున భక్తులు బుగ్గ రామలింగేశ్వరస్వామి దర్శనార్థం వస్తుంటారు. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో నిర్మించిన ఈ ఆలయంలో శివలింగం కింద నుండి నీరు ఉబికి రావడంతో పాటు శ్రీరాముడు ఈ లింగాన్ని ప్రతిష్ఠించడంతో బుగ్గరామలింగేశ్వర స్వామిగా పిలవబడుతోందని చరిత్ర చెబుతోంది. ఆలయంలో ఎక్కడ చూసినా శిల్పకల ఉట్టిపడుతుంది. ఇక్కడే ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో రాతి స్తంభాలను తాకితే సప్తస్వరాలు వినిపించడం మరో విశేషం. ఆలయ విశిష్టతను గుర్తించిన ప్రభుత్వం 10వ తరగతి పాఠ్యపుస్తకంపై గోపుర చిత్రాన్ని ముద్రించింది. కార్తీక మాసం, శ్రావణ మాసంలో పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి పోటెత్తుతారు.

ఇదీ ఆలయ చరిత్ర ..

ఉత్తర కాశీగా వారణాసి, దక్షిణ కాశీగా బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందాయి. త్రేతాయుగంలో శ్రీరామునిచే శివలింగ ప్రతిష్ఠ జరిగిందని చరిత్ర చెబుతోంది. విజయనగర సామ్రాజ్య పాలనలో గుత్తి గండికోట ప్రాంతానికి చెందిన పిమ్మసాని రామలింగనాయుడు 1409-1509 కాలంలో ఆలయ నిర్మాణం చేపట్టారు. బ్రాహ్మణుడైన రావణుడిని చంపిన కారణంగా వచ్చే పాప విముక్తి కోసం శ్రీరాముడు దేశంలో అనేక శివలింగాలు ప్రతిష్ఠించాడు అలా ప్రతిష్ఠించిన లింగాల్లో ఇదీ ఒక్కటని చెబుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హయాంలో..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హయాంలో ఆలయంలో పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం అనేక నిర్మాణాలు చేపట్టి ఆలయ అభివృద్ధికి బాటలు వేశారు. దాతల సహాయంతో ఆలయం ఎదురుగా పెద్ద నంది విగ్రహం ఏర్పాటు చేయించారు. అలాగే రూ.18 లక్షలతో గాంధీ కట్టవద్ద ఆలయ ముఖ ద్వారా నిర్మాణం, ఆలయ పరిసరాల్లో సీసీ రోడ్లు, పార్కింగ్ ఏర్పాటు చేయించారు. అలాగే గర్భగుడిలో చిన్నపాటి మరమ్మతు చేపట్టారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అలంకరణలో ముసలమ్మ తల్లి, కాశీ విశాలాక్షి

బుక్కరాయసముద్రం: కార్తీక మాస ఆదివారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో ఉన్న పురాతన కాశీ విశ్వేశ్వర ఆలయంలో కాశీ విశాలాక్షి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ముసలమ్మ తల్లి ఆలయంలోనూ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బి.విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చీలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బి.విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలు మనకు దేవుడిచ్చు బహుమానమన్నారు. మన పిల్లలను చిన్ననాటి నుంచే దైవభక్తితో పెంచాలన్నారు. చిన్న పిల్లలదే దేవునిరాజ్యమన్నారు. బాలుడు నడవవలసిన త్రోవను వానికి నేర్పు వాడు పెద్దవాడైనప్పుడు దాని నుంచి తొలగిపోడని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు వీరయ్య, జకరయ్య, జయరాజు, అబ్రహాం, రత్నరాజు, బుజ్జిబాబు, కరుణాకర్, రాజు, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణమ్మ, మంజుల, దేవమ్మ, చంద్రకళ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, వాణి, రేచెల్, ప్రశాంతి, మెర్సీ, రజని తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల్లో వణుకు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దపప్పూరు: నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకుని దిన, వారం, నెల వడ్డీలను ముక్కుపిండి వసూలు చేస్తున్న వడ్డీ వ్యాపారుల్లో వణుకు పుట్టింది. 'వడ్డీ జలగలు' శీర్షికన ఆదివారం 'సాక్షి' దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో అధిక వడ్డీలు వసూలు చేస్తున్నవారిలో వణుకు పుట్టింది. మరోవైపు తాము తీసుకున్న డబ్బుకు అధిక వడ్డీలు చెల్లించాల్సిన అవసరం ఇక ఉండబోదని, తమపై ఒత్తిడి చేస్తే పోలీసులను ఆశ్రయించాలనే యోచనలో వడ్డీల బాధితులు ఉన్నట్లు తెలిసింది. పెద్దపప్పూరు మండలంలోని గార్లదిన్నె గ్రామానికి చెందిన పలువురు మండల కేంద్రంలోని రామకోటి కాలనీలో కొందరికి దిన, వార, నెలకు డబ్బులిచ్చి వందకు రూ.4 నుంచి రూ.10కి పైగా వడ్డీని వసూలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు బాధితులు వడ్డీలు చెల్లించలేక ఇంటి పత్రాలు తాకట్టుపెట్టడంతో పాటు మహిళల నగలను తాకట్టులో పెట్టారని చెబుతున్నారు. అధిక వడ్డీలు వసూలు చేసేవారి వివరాలను బాధితులు తెలియజేస్తే తక్షణం చర్యలు చేపడతామని ఎస్పీ జగదీష్ అభయమివ్వడంతో బాధితులకు భరోసా ఇచ్చినట్టైందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నారాయణా నమోస్తుతే !



అలంకరణలో అశ్వర్థనారాయణ స్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: కార్తీకమాసం తొలి ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వర్థ క్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి తడిదుస్తులతో స్వామిమవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామివారికి ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతియేటా కార్తీకమాసంలో నాలుగు శని, ఆది, సోమవారాల్లో భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివస్తారని, కుజదోషమున్న వారు సుబ్రహ్మణ్యస్వామికి తైలాభిషేకం చేయడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, సునీల్ కుమార్ శర్మ, బాలసుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. స్వామి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

నిరుపయోగంగా చెత్త సైకిళ్లు



యల్లనూరులో పాత సచివాలయం వద్ద మూలన చేరిన సైకిళ్లు

యల్లనూరు: స్వచ్ఛభారత్ కింద గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చెత్తా చెదారాన్ని తరలించేందుకు పంచాయతీలకు సైకిళ్లను పంపిణీ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ సైకిళ్లను వినియోగించడం లేదు. అవి తుప్పు పడుతున్నా అధికారులు సైతం పట్టించుకోలేదు. ఈ సైకిళ్లల్లో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించేవారు. అయితే మండలంలో కొన్ని నెలలు మాత్రమే వీటిని వినియోగించారు. చాలా రోజుల నుంచి వాటిని వాడకపోవడంతో పాత సచివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్నాయి. సైకిళ్లను వినియోగించకపోవడంతో ప్రజాధనం వృథాగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో మరింత దృష్టి పెట్టలేకపోతున్నారు.

జోత్స్నకు రాష్ట్రస్థాయి ప్రతిభా అవార్డు



జ్యోత్స్నకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: మండల పరిధిలోని ఎస్.తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జ్యోత్స్న రాష్ట్రస్థాయి ప్రతిభ అవార్డు అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం ఎం.నారాయణరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో జరిగిన కథల పోటీల్లో ఏపీ నుంచి 4 కథలు ఎంపిక కాగా.. అందులో జ్యోత్స్న రాసిన కథ ఉందని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో బాలసాహితీవేత్త, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్, మాస్టర్ స్టోరీ టెల్లర్ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కపు వెంకటరమణ, కేంద్ర సాహిత్య తెలుగు అకాడమీ కన్వీనర్ మృణాలిని చేతుల మీదుగా విద్యార్థిని జ్యోత్స్నకు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే తల్లిదండ్రులు శేషు, పద్మావతిని అభినందించారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాపిలి నుంచి గుత్తికి వస్తున్న ఆటోలో వెనుక కూర్చొన్న శ్రీనివాసులు (ప్యాపిలి) స్పీడ్ బ్రేకర్ వద్ద జారి కింద పడ్డాడు. ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసులును స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

'నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డి ఆదివారం తెలిపారు. మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించాలని సూచించారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

17న కోటంకలో లక్ష దీపోత్సవం

కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17న లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున 4 గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం లక్ష దీపోత్సవం, రాత్రి 9 గంటలకు భజన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

గుంతకల్లు రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గుంతకల్లు రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యాడికి రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.రాజ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గుత్తి తహసీల్దార్ ఓబులేసు, ఉపాధ్యక్షులుగా వజ్రకరూరు డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కుమార్, గుంతకల్లు తహసీల్దార్ రమాదేవి, పెద్దవడుగూరు ఆర్ఐ వీ.లహరిక ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గుత్తి ఎంఎల్ఎస్ స్టాకిస్ట్ ఆదినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గుంతకల్లు ఆర్ఐ హరిప్రసాద్, జాయింట్ సెక్రెటరీలుగా గుంతకల్లు ఆర్డీఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్లు షేక్షావలి, వన్నప్ప, ఉరవకొండ ఆఫీస్ సబార్డినేట్ షర్మాస్ వలి, ట్రెజరర్‌గా గుత్తి సీఎస్‌డీటీ సూర్యనారాయణను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



కల్లూరు - తరిమెల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై బోర్డు ఏర్పాటు చేసిన పోలీసులు

గార్లదిన్నె: గార్లదిన్నె, తలగాచిపల్లి, కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. ఆదివారం సీఐతోపాటు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపే సీటు బెల్టు ధరించాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడపరాదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

నెట్టికంటుడికి రూ.లక్ష విరాళం



దాతలకు ఆంజనేయస్వామి ఫొటో, ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: బెంగళూరుకు చెందిన స్కంద దర్శన్, లక్ష్మి శిరీష దంపతులు ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శాశ్వత వజ్రకవచ సేవ కోసం రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేర్లతో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతలకు స్వామి ఫొటో, ప్రసాదం అందజేశారు.

భక్తిమార్గంతోనే ప్రశాంత జీవనం



ప్రసంగిస్తున్న మల్లాది రామనాథశర్మ

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికత, భక్తిమార్గం మానసిక జీవితాన్ని ప్రసాదిస్తాయని ప్రముఖ ప్రవచన కర్త మల్లాది వేంకట రామనాథ శర్మ అన్నారు. నగరంలోని శ్రీశృంగేరీ శంకర మఠం వేదికగా ఈ నెల 3 నుండి 9వ తేదీ వరకు సాగనున్న 'భాగవత సప్తాహం' ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. జగద్గురు భారతీతీర్థ మహాసన్నిధానం వారి సన్యాసాశ్రమ స్వీకార మహోత్సవాల సందర్భంగా పీఠం ఆస్థాన పండితుడు పౌరాణిక సార్వభౌమ బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి జయంతి ఉత్సవాలు అంతటా ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అనంతకు రావడం ఆనందంగా ఉందని ప్రవచన కర్త మల్లాది వేంకట రామనాథ శర్మ తెలిపారు. అనంతరం శ్రీమద్భాగవతంలోని పలు ఘట్టాలను ఉపమాన సహితంగా వివరించారు. నిర్వాహకుడు సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఏడు రోజుల పాటూ రోజు సాయంత్రం పురాణ ప్రవచనం ఉంటుందన్నారు. అంతకు ముందు మఠంలోని శ్రీ శారదా చంద్రమౌళీశ్వరులకు జరిగిన ప్రత్యేక పూజల్లో రామనాథశర్మతో పాటూ పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడం తగదు'



ఏఓ గిరిజా మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జీఓ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం మెడికల్: ఎఫ్ఆర్ఎస్ నమోదు జాప్యం పేరుతో ఆరోగ్యశాఖలోని 91 మంది ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు వేతనాల్లో కోత విధించడం సరికాదని ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మాధవ, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీధర్‌బాబు, అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో వారు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఏఓ గిరిజా మనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక పరమైన సమస్య కారణంతో ఎఫ్ఆర్ఎస్ జాప్యం జరిగిందని తెలిపారు. అందుకు చిన్న స్థాయి ఉద్యోగులకు భారీగా కోత విధించడం తగదన్నారు. ఎఫ్ఆర్ఎస్‌లో సర్వర్‌కు డేటా అనుసంధానం కాకపోవడంతోపాటు మహిళా ఉద్యోగులకు అదనంగా ఉన్న స్పెషల్ క్యాజువల్ లీవులు ఎఫ్ఆర్ఎస్‌లో చూపకపోవడంతో సెలవులు ఎక్సీడ్ కావడం జరిగిందన్నారు. ఎఫ్ఆర్ఎస్‌లో సెలవు యాడ్ చేసినప్పుడు యాక్సప్ట్ కొట్టడం ఆలస్యం కావడంతో గైర్హాజరును చూపి వేతనాలు కోత విధించడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ నాయకులు శ్రీనివాస్ కుమార్, జమీలా బేగం, హంస వేణుగోపాల్, ఏపీఎన్‌జీఓ తాలూకా అధ్యక్షులు అక్కులప్ప, శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ సంఘం జాఫర్ మొహిద్దీన్, త్యాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ శర్మ, మస్తాన్, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు జయవర్ధన్ రెడ్డి, మహేష్‌రెడ్డి, ఖాదర్, సత్యనారాయణ, శివకుమార్, నాగరాజు, నాగమణి, ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్, ప్లంబింగ్‌లో ఉచిత శిక్షణ

గుంతకల్లు రూరల్: న్యాక్, స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో గుంతకల్లు స్కిల్ హబ్ ట్రెనింగ్ సెంటర్‌లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ల్యాండ్ సర్వేయర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆయా విభాగాల్లో ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7013858450, 8096763970 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నిర్మల

గుత్తి: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీపీఎం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నిర్మల, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, రేణుక, మల్లికార్జున, రమేష్, మల్లేష్, రంజిత్ నాయక్, రామేశ్వరి, మద్దిలేటి, ఆహ్వానితురాలిగా రేవతిని ఎన్నుకున్నారు. నూతన మండల కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ .. పార్టీని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేస్తామన్నారు.